# ఊరు ఉండమంటుంది...

"గుర్రం గుడ్డిదయినా దాణాకు లోపం లేదు"అన్న సామెత మనకు తెలిసిందే!

"సంస్థానం చిన్నదయినా సరదాలకు లోపం లేదు" అన్న సామెత మనకు కొత్తగానీ, సంస్థానాధీశులకు కాదు.

కర్నూలు జిల్లాలోని బనగానిపల్లి సంస్థానం నిజానికి చిన్నదే! దాని ఆదాయం కూడా - ఇతర సంస్థానాలతో పోలిస్తే అంతంత మాత్రమే! కానీ, ఆ సంస్థానాధీశుల సరదాలు చూస్తే- మరే మహారాజుగారి సరదాలకు తీసిపోవు. పెద్ద పెద్ద సంస్థానాధీశుల్లాగానే, ఈ బుజ్జి రాజాలూ ఖర్చు పెడుతూ ఉండేవారు. అయితే, కళ్లు తిరిగేటంత మొత్తాలను ఈ ఛోటా నవాబులు ఎలా సేకరించేవారు? ఈ ప్రశ్నకు సమాధానం చాలా సులభం. ప్రజల మీద అదనంగా పన్నులు వేసేవారు. వారి శ్రమను, దారుణంగా దోచుకొనేవారు. ఆ డబ్బునంతా తమ విలాసాలకు వ్యయం చేసేవారు.

బనగానిపల్లి నవాబులకున్న సరదాలు ఇన్నీ అన్నీ కావు. వాటన్నిటిలోకి ఖరీదైన సరదా- గుర్రాలను పెంచడం.

సింహాసనం మీద కూచున్న ఆఖరు నవాబుగారు ఓసారి హైదరాబాద్ నవాబుగారిని దర్శనం చేసుకొన్నారు. నిజంగా అంతులేని సంపదను చూడలేకపోయారు గానీ, వారి అశ్వసంపదను మాత్రం చూశారు. అందులో ఒక గుర్రం వారికి నచ్చింది. దాని అనుపానులన్నీ తెలుసుకున్నారు. తెలుసుకొని, అదే కుటుంబానికి చెందిన మరో గుర్రాన్ని కొన్నారు. అలా కొనడానికి ముందు తమ ఏజెంట్లను దేశమంతా తిప్పారు. అలా తిప్పడానికి వేలాది రూపాయలు ఖర్చయ్యాయి. అయినా సరే- ప్రిన్స్ ఆఫ్ బేరార్ ముచ్చటపడిన గుర్రం లాంటిదే తన కొడుక్కూ వుండాలి. ఆ గుర్రాన్ని చూసి తన కొడుకూ ముచ్చటపడాలి.

"హసీనా" అన్న గుర్రం కోసం, బొంబాయి నుండి కర్నూలు దాకా ప్రత్యేకమైన రైలు బోగీని ఏర్పాటు చేశారు బనగానిపల్లి ప్రభువులు. ఆ గుర్రంతోపాటే, దాన్ని 'మసాజ్' చేసే మొయినుద్దీన్ కూడా బనగానపల్లి వచ్చాడు.

"అప్పుడు వేస్తే వేయి రూపులుగా ఉండేవాణ్ణి. గిరిజాల జుట్టు చక్కని గెడ్డం, అత్తరుల్లో మునిగితేలుతూ ఉండేవాణ్ని. అదీ గాక అంతకు సంవత్సరం కిందట్నే నాకు పెళ్ళయింది" అన్నాడు మొయినుద్దీన్ నవ్వుతూ.

నవాబుగారు, అతనికీ, అతని కుటుంబానికి కలిపి పెద్ద ఇల్లిచ్చారు. ఆ ఇంటి ప్రక్కనే గుర్రపు సావడి. రోజురోజంతా ఆ గుర్రం దగ్గరే మొయినుద్దీన్ గడుపుతూ ఉండేవాడు. "హసీనా- అంటే నవాబు గారికి వల్లమాలిన ఆపేక్ష. తనకు లోపం జరిగినా సహించేవాడు గానీ, గుర్రానికి లోపం జరిగినట్లు అనుమానం కలిగితే, చంపేసేవాడు. ప్రజల్ని కలుసుకోవడానికైనా ఆయనగారు నిరాకరించేవారేమో గానీ, హసీనాను చూడకుండా ఉండేవారే కాదు." అన్నాడు మొయినుద్దీన్ ఆ పాత రోజుల్ని గుర్తు చేసుకుంటూ.

గుర్రాన్ని మేపటం వరకూ మంచిదేగానీ, దానికి సోమరితనం మప్పకూడదని, మొయినుద్దీన్

చాలా సార్లు సూచనగా చెప్పి చూశాడు. వేరే కసరత్తు అవసరం లేదనీ, మాలిష్ మాత్రమే సరిపోదని, సవారీ కూడా చేయాలనీ, అతనన్నాడు. అలా అన్నప్పుడల్లా 'ఖాముష్‌సాలే' అనేవాడట నవాబుగారు.

ఒకసారి తన కొడుకుల్ని, హసీనా మీద కూరోచబెట్టి ఫోటోలు తీయించాడుట. ఆ ఫోటోలను బొంబాయిలో డెవలప్ చేయించి ఒక కాపీని నిజాంగారికి అందేలాగానూ చేశాడుట!

"తన దగ్గర బ్రహ్మాండమైన గుర్రం ఉన్నదని మిగిలిన వారికి తెలియజేయడం కోసం, ఆయన ఖరీదైన విందుల్ని కూడా ఏర్పాటు చేశాడు. ఆ విందులకు ఎక్కడెక్కణ్ణించో డబ్బున్న మారాజులంతా వచ్చేవారు. డాన్సులు, తాగుళ్ళు, ఆ తరువాతవీ విచ్చలవిడిగా సాగిపోయేవి. వేలాది రూపాయలు కళ్ళముందే కరిగిపోయేవి."

ఈ రంగరంగవైభోగం, అయిదారేళ్ళ పాటు నిరాఘాటంగా సాగింది. నవాబుగారిక్కూడా హసీనా మీద మోజు తగ్గిపోయింది. వారి దగ్గరనున్న మిగిలిన గుర్రాలకూ, హసీనాకూ తేడా అన్నదే లేకుండాపోయింది. ఒకప్పుడు మహారాజు వైభోగం అనుభవించిన హసీన ఆ సాలలోనే మామూలుకన్నా హీనమైన బతుకును చవి చూసింది.

"సరిగ్గా నా పని కూడా అంతే అయింది బాబూ! బనగానిపల్లిలో ఉండగా, నా చేతి కింద ముగ్గురు పనివాళ్ళుండేవాళ్ళు. నా భార్య 'బేగం సాబ్'లాగా బతికింది. హసీనా రాత మారటంతో నా జాతకం కూడా మారిపోయింది. నేనూ అక్కడో కుక్కలాగా గడిపాను. ఏ రోజున నన్ను నవాబుగారు నౌఖరీ వొదిలి పొమ్మంటారోనని హడలి చచ్చాను"అన్నాడు మొయినుద్దీన్.

చివరికి అనుకున్నంతా అయింది. కట్టుబట్టలతో బనగానిపల్లి విడిచి పెట్టాడు మొయినుద్దీన్. ఆ చుట్టుపక్కల ఉండేందుకు ముఖం చెల్లలేదు. అందుకని హైదరాబాదు వచ్చాడు.

"అప్పణ్ణించే నా కష్టాలు మరీ పెరిగి పోయాయండీ! గుర్రాల మాలీష్ తప్ప- ఇంకేపనీ రాదు. ఇంక దేనికి అలవాటు పడలేదు. అప్పటికే నాకు ముగ్గురు పిల్లలు. ఆఖరువాడు మగపిల్లాడు... నేను చేయని పనిలేదు బాబుగారూ! పస్తులుచేయని వారం లేదు. కొంత కాలం రొట్టెల దుకాణంలో పని చేశాను. తరువాత కట్టెల అంగట్లో కొంత కాలం ఉన్నా. ఓ గ్లాస్ ఫ్యాక్టరీలో రెండేళ్ళు పనిచేశా. అప్పుడే నా పెద్దల్లుణ్ణి చూశా. మా జబ్బార్ కోత మిషన్ దగ్గర ఉండేవాడు. పిల్ల మరీ ముదిరి పోతుందని వాడికిచ్చా. వాళ్ళిద్దరూ, సనత్‌నగర్‌లోనే ఉంటున్నారిప్పుడు. వాళ్ళకు నలుగురు పిల్లలు" అన్నాడు మొయినుద్దీన్.

మొయినుద్దీన్ భార్య చచ్చీ చెడీ, ఓ బట్టల మిల్లులో కూలీకి కుదిరింది. ఇక పర్వాలేదు గదా అనుకొన్నాడు మొయినొద్దీన్.

"కానీ భగవంతుడికి నా మీద దయ తప్పింది. నన్ను పనిలోంచి తీసేశారు. మళ్ళీ దరిద్రం. ఆకలి- వీటికన్నా మా అబ్బాయిదో పెద్ద సమస్య. వాడు పరమ బద్మాష్‌గా తయారయ్యాడు... మా రెండో అమ్మాయిని గురించి అడక్కండి బాబూ! అది చక్కని చుక్క కుందనం బొమ్మ. అచ్చంగా - దానిదంతా వాళ్ళమ్మ పోలికే!" అని కళ్ళు తుడుచుకొన్నాడు మొయినుద్దీన్.

"రజియాక్కూడా పెళ్ళి చేదామనుకొన్నాడు మొయినుద్దీన్. పిల్ల ఎంత చక్కందయితేనేం గాక - కాస్త ఉన్న సంబంధం మాత్రం తటస్థ పడలేదు. ఏదో వో దారిన పోయే దానయ్యకివ్వడానికేమో

మనసొప్పదు. సరిగ్గా ఆ సమయంలోనే చిన్న కొడుకు ఓ సంబంధం తీసుకొచ్చాడు. ఆ పెళ్ళికొడుకుది ఈ ఊరు కాదు. ఈ దేశమూ కాదు. కువాయిట్‌లో అతనికి చాలా ఆస్తిపాస్తులున్నాయట. ఉన్న మాట కూడా నిజమే కావచ్చు. కాకపోతే ఆ షేక్, అలా వందలకు వందలు, చిత్తుకాగితాల్లా ఖర్చు చేస్తాడా? తన ఆమోదం లేకుండానే రజియా పెళ్లి ఆ షేక్‌తో జరిగిపోయింది. పెళ్ళయిన మరునాడే వాళ్ళిద్దరు బొంబాయి వెళ్ళారు. అక్కణ్నించి కువాయిట్ వెళ్ళిపోతామన్నారు.

“నా రజియాను అదే ఆఖరుసారి చూడడం బాబూ! ఈ మూడేళ్ళ నించీ, దాని సంగతి మాకేమీ తెలీదు. ఆ దిగులుతో మా ఆవిడ కన్ను మూసింది. మావాడుషేక్ దగ్గర అయిదువేలు తీసుకొన్నాడని తరువాత తెలిసింది. వాడూ, అంతు పొంతూ లేడు. ఇక మిగిలిందల్లా...” అని బావురుమన్నాడు మొయినుద్దీన్.

ఇంకేం చేయడానికి చేతకాక, ఈ మధ్యనే ఈ మారుబేరం ప్రారంభించాడు మొయినుద్దీన్. ఇంత వరకు నష్టం రాలేదు. గానీ- అనుకొన్నంత లాభం కూడా రాలేదంటాడు మొయినుద్దీన్.

“మార్కెట్‌లో ఓ కుప్పకుప్ప కొంటానండీ! అందులో ఎన్నుంటాయో, గుత్తెదారు చెప్పడు. లెక్క పెట్టుకోనీడు. కొంత మంది కట్టలు కట్టి అమ్ముతారు. ఒక్కో కట్టలో వంద తేగలుంటాయి. వాడు ఐదు రూపాయలు చెబుతాడు. నేను రెండు దగ్గర్నించి బేరమాడతా. మరీ ముదురువి ఎవరూ కొనరు. లేతవేమో సవ్వగా ఉంటాయి. మరీ చిన్నదయితే 5 పైసలు, పెద్దదీ పదునుమీద ఉన్నదీ అయితే పావలా. ఏ రోజు సరుకు ఆ రోజునే అమ్ముడు పోదు. అలాగని నిలవవుంచితే ఎండిపోతాయి. నాకిప్పుడు 78 ఏళ్లు. ఎవ్వరూ లేరు బాబూ నాకు. ఎప్పుడో దాటిపోదామనుకొన్నా. పోయినా ఈ బాధలుండవు. కానీ బాబూ, పాపిష్టి ముండా కొడుకును, ఇంకా చావురావడం లేదు...” తుండుగుడ్డతో కళ్ళొత్తుకున్నాడు మొయినుద్దీన్.

అతని కన్నీరు తుడిచేందుకొక్క దయామయుడు కూడా ఈ దేశంలో లేడా?